# గురు దక్షిణ

అద్దంలో తన కడుపును పదే పదే చూసుకుంది కమల. చూసేకొద్దీ ఆనందం!

ప్రతాప్ ప్రతిరూపం తన కడుపులో వుంది. ఎక్కడి నుంచి వచ్చాడో ఏమో! ఆ ఊరికి టీచర్‌గా వచ్చాడు. పిల్లల మనసుల్ని పూర్తిగా జయించాడు.

తనని ఉద్ధరిస్తా నంటూ ముందు కొచ్చాడు. భగవంతుడిచ్చిన రూపం తప్ప తన కేముంది అప్పుడు? చదువా? సంస్కారమా?

"మీ ఊరి కథ నాకు తెలుసు కమలా? అజ్ఞానమే ఆ ఊరి అనర్థాలన్నిటికీ మూలం. మిమ్మల్ని సంస్కరించాలంటే మీలో నేను ఒకణ్ణి కావటం అవసరం.

ప్రతాప్ ఆమెను ఆకర్షించాడు. తండ్రితో పోట్లాడి అతన్ని పెళ్ళి చేసుకోవలసి వచ్చింది.

పెళ్లయ్యాక అతను తన మాట మార్చాడు. అలవాట్లు మార్చాడు. ఆలోచనా ధోరణినే మార్చేశాడు.

"చెడు ఆలోచనలు, పనులు మనిషిని సులభంగా ఆకర్షించి లొంగతీసుకుంటాయి కమలా? ఆ బలహీనతను జయించాలి. మంచిలోని మాధుర్యాన్ని గ్రహిస్తే మానవుడికి అసలైన ఆనందం లభ్యమవుతుంది. నీలో వచ్చిన మార్పు మీ ఊళ్ళో ప్రతి ఒక్కరిలో రావాలి. ముఖ్యంగా మీ నాన్నగారిలో"

సాధ్యమా అది? తన తండ్రి ఆ గూడేనికే నాయకుడు. ఒక పద్ధతి జీవిత విధానానికి అలవాటు పడ్డవాడు.

పగలంతా ప్రతాప్‌ను గురించిన ఆలోచనలే. రాత్రికి, అతను రాగానే అతన్ని చుట్టుకుపోయిందామె. ఆసంతోష వార్తను చెప్పింది.

"గుడ్ . ఈ సందర్భంలో ఏం కావాలో కోరుకో"

"మీ గుండెల్లో తల పెట్టుకొని పడుకుంటాను. మంచి కథ ఒకటి చెప్పండి."

అతను చెప్పే కథలంటే ఆమెకు ప్రాణం. దొంగల కథలు, పోలీసుల కథలు, రాజకుమారుల కథలు ఏం చెప్పినా అందులో నీతి ఉంటుంది.

ప్రతాప్ కథ చెప్పటం ప్రారంభించాడు.

★——★——★

రమాలు పెళ్ళి ఇంక నాలుగు రోజుల్లోకి వచ్చింది. నిద్ర పట్టక సీతారామయ్య మాస్టారు మంచంలో అటూ ఇటూ పొర్లుతున్నాడు. గాలికి కిటికీ తలుపులు గడగడా వణికిపోతున్నాయి. చిమ్మచీకటితో గుడ్డిదీపం మినుకు మినుకు మంటూ ఒంటరిగా పోరాడుతోంది.

మూడు రోజులుగా కురిసిన వాన ఆ రోజే కాస్త తగ్గింది. ఆ గాలివానకు విద్యుచ్ఛక్తి ఎప్పుడో పోయింది. ఆ ఊరితో ఇతర ఊళ్ళకు సంబంధాలు తెగిపోయాయి. రైలు మార్గం లేని ఊరు అది. బస్సులు వచ్చే వీలు కూడా లేకుండా రోడ్లు చెడిపోయాయి. ఇంటి చుట్టూ మొల లోతు నీళ్లు నిలిచి ఉన్నాయి.

పెళ్ళినాటి కన్నా పరిస్థితులు చక్కపడతాయా? పెళ్ళికూతురు కూడా ఊళ్ళోలేదు. పెళ్లివాళ్లు, రమాలు అన్నా పెళ్లినాటికి ఊరికి రాగలుగుతారా?

భయాందోళనలతో సీతారామయ్య మాస్టారు మనసు అల్లకల్లోలంగా ఉంది. ఎన్నో సంవత్సరాలు ఉపాధ్యాయుడుగా పని చేసి ఇటీవలే రిటైరయ్యా డాయన. విద్యా 'దానం' చెయ్యటం ఉపాధ్యాయుడి విధి, ధర్మం అని విశ్వసించిన వ్యక్తి ఆయన.

విద్యార్థులంటే ఎంత ప్రేమో? తెలివితేటలు తక్కువగా ఉన్నవాళ్ళన్నా, అల్లరి చేసేవారన్నా ఆయనకి మరింత ఇష్టం. వాళ్ళను మంచితనంతో జయించి మేధావులుగా తీర్చిదిద్దేవాడు. అలాంటి వారు ఎంతమంది గొప్ప గొప్ప పదవులలోకి వెళ్ళేరో?

కానీ రిటైరయ్యేనాటికి ఆయనకు ఉండటానికి ఇల్లన్నా లేదు. రమాలు పెళ్ళి బాధ్యత మాత్రం ఉంది. ఆయన పూర్వ విద్యార్థు లంతా కలిసి ఆయనతో చెప్పకుండానే ఆయనకి ఒక చిన్న ఇల్లు కట్టించారు. ఆయన పదవీ విరమణ సందర్భాన్ని పురస్కరించుకొని ఒక సభ జరిపి ఆయనకు ఆ ఇంటిని గురుదక్షిణగా సమర్పించుకున్నారు.

అదృష్టం బాగుండి రమాలుకు సంబంధం కూడా కుదిరింది.

కాలికి బలపాలు కట్టుకొని ఆఫీసుల చుట్టూ తిరిగ్గా తిరగ్గా నాలుగు రోజుల క్రితమే ఆయనకు రావలసిన డబ్బు వచ్చింది. ఆ డబ్బుతో కట్నం సొమ్ముపోగా మిగిలిన దానితో రమాలుకు రెండు పట్టుచీరలు, మెళ్ళోకి కాస్త బంగారం కొందామనుకొన్నాడు. ఇంతలో వర్షం పట్టుకొంది.

ఎటునుంచి వచ్చిందో చల్లటిగాలి రివ్వున లోపలికి వచ్చింది. దీపం ఆరిపోయింది.

తలగడ కింద ఉన్న బేటరీలైటు కోసం తడిమాడు. బాటరీలైటు అక్కడ లేదు. ఆయన గుండె గుభేలు మంది. మంచంమీద నుంచి లేవబోయాడు. ఆయన మొహం మీదికి బాటరీలైటు ఫోకస్ చేయబడింది. ఆయన నోటిని ఒక చెయ్యి మూసేసింది.

''డబ్బు ఎక్కడ దాచేవ్? చెప్పు!''

చూడబోతే వీళ్ళెవరో తన దగ్గర డబ్బు ఉందని తెలుసుకొని వచ్చినట్లున్నారు! ఇప్పుడేంచెయ్యాలి?

''డబ్బేమిటి బాబూ? బీదవాళ్ళం మేము''

''ఏయ్ ముసలీ. అబద్ధం ఆడితే నాలిక కోసేస్తా! కూతురు పెళ్ళికి దాచిన డబ్బు ఎక్కడ దాచారో చెప్పు''

''నాయనలారా! నా ఇంట్లో డబ్బున్న మాట నిజమే. కానీ అది నా కూతురి పెళ్ళికని దాచిన సొమ్ము నాయనా! ఆ సొమ్ము మీ కిస్తే దాని పెళ్ళి ఆగిపోతుంది కదా? అలా చేయటం మీకు భావ్యమా? దొంగలక్కూడా ధర్మం ఉంది నాయనా!''

''ముసలాడా! నా క్కావల్సింది నీ డబ్బు. పాఠాలు కాదు'' అంటూ ఒకడు ఆయన్ని కాలితో తన్నాడు. మంచానికి కట్టేసి హింసించసాగేడు.

''మీరు నన్ను హింసించకపోతే చెప్పేవాడినే. కానీ ఇప్పుడు చెప్పను. మీ హింసాప్రవృత్తికి, అధర్మ మార్గానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేస్తాను. మీరు నన్ను చంపినా ఆ డబ్బు ఎక్కడుందో చెప్పను.''

ఆ తరువాత ఆయన మౌనం వహించాడు. దొంగలు దీపం వెలిగించారు. ఆయన్ని రకరకాలుగా బాధలు పెట్టారు. అయినా మాస్టారు చలించలేదు.

కానీ సావిత్రమ్మ ఆ హింసను చూడలేక పోయింది.

''డబ్బు నేను తీసుకొచ్చి ఇస్తాను. ఆయన్ని వదలండి బాబూ?''

ఆమె లోపలికి వెళ్ళబోతుండగా 'వద్దు' అన్నట్లు మాస్టారు సౌంజ్ఞచేశాడు. అయినా ఆమె లోపలికి వెళ్ళి తిరిగి వచ్చింది.

''ఏదీ డబ్బు?''

''ఇదిగో?''

ఆమె రెండు గుప్పిళ్ళలో ఉన్న కారం పొడిని ఇద్దరు దొంగల కళ్ళల్లోనూ కొట్టింది. కానీ ఒక దొంగ తప్పించుకున్నాడు.

''ముసలి ముండా? మా కళ్ళలో కారం గొడ్తావే? నిన్నేం చేస్తానో చూడు!''

దొంగ ఆమె జుట్టు పట్టుకొని లాగాడు. కాళ్ళతో పొట్టమీద తన్నాడు. కింద పడేసి తలను నేలకేసి దభీదభీ మని కొట్టసాగాడు.

సావిత్రమ్మ కేకలు పెడితే నోట్లో గుడ్డలు కుక్కాడు.

''హింసను హింసతో జయిద్దామనుకున్న ఆమె అజ్ఞానాన్ని మన్నించండి నాయనలారా! ఆ అర్భకురాలిని వదిలెయ్యండి. డబ్బు ఎక్కడ దాచిందీ నేను చెప్తాను. తెచ్చుకోండి.''

సీతారామయ్య మాస్టారు చెప్పిన చోట డబ్బుంది. ఆ డబ్బుతో పాటు ఇంట్లోని విలువైన సామాను కూడా మూటకట్టుకొన్నారు దొంగలు.

''ముసలి ముండా. ఇదిగో డబ్బు. నువ్వుచేసిన పనికి నీ ఇంటికి అగ్గి పెట్టాలి. నీ నెత్తిన కిరసనాయిల్ పోసి కాల్చేయాలి. కానీ ఆ ముసలాడి నిజాయితీ చూచి వదిలేస్తున్నాం. కానీ నన్ను బాధపెట్టినందుకు నిన్ను ఊరికే వదలను'' అంటూ అతడామె జుట్టును రెండు పాయలు చేసి మంచంకోడుకేసి కట్టాడు. నోట్లో గుడ్డలు కుక్కాడు.

అతను వెళ్ళబోతుండగా సావిత్రమ్మ అతని కాళ్ళు పట్టుకొంది.

''అందితే జుట్టు అందకపోతే కాళ్ళు, కాలువదలవే ముసలిపీనుగా!'' అతనామె పీక పట్టుకొని నొక్కేడు.

''సావిత్రీ... సావిత్రీ...'' అరిచి అరిచి నీరసం వచ్చింది మాస్టారికి. కానీ సావిత్రమ్మ నుంచి జవాబు లేదు.

★——★——★

''అంటే ఆమెను ఆ దొంగ గొంతు పిసికి చంపిపోయాడా?''

''ఊ....''

'' ఆ తరువాత ఏం జరిగింది?'' కమల అడిగింది.

''ఏం జరగాలనుకుంటున్నావ్!''

''ఆ దొంగల్ని - ఐమీన్ హంతకుల్ని - పోలీసులు పట్టుకొన్నారా? న్యాయం జరగాలి గదా?''

''కదా! కానీ ఇంతవరకూ జరగలేదు.''

''ఎందుచేత? మాస్టారు కేసు విషయంలో శ్రద్ధ వహించలేదేమో?''

''ఆయన ఇప్పటి క్కూడా ఇంకా బతికి ఉన్నది ఆ న్యాయం కోసమే''

''కానీ పోలీసు వ్యవస్థ అంతా లంచగొండితనంతో కలుషితమైందని మీరే చెప్పారుకదా?''

''నిజమే. కానీ యీ కేసు విషయంలో మాత్రం అది కూడా కారణం కాదు. ఎందుకంటే అప్పట్లో ఆ జిల్లా పోలీసు అధికారి మాస్టారి శిష్యుడే. మాస్టారు మర్నాడు నేరుగా అతని వద్దకే వెళ్ళాడు.

''అతని పేరు ప్రవీణ్. ప్రవీణ్ చిన్నప్పుడు చెడు సావాసాలు పట్టి రౌడీ పనులు చేసేవాడు. రెక్కాడితే కాని డొక్కాడని అతని తండ్రి మాస్టారి దగ్గరి కొచ్చి మొరపెట్టుకున్నాడు.

ప్రవీణ్ మాస్టారుగారి క్కూడా లొంగలేదు. కాగా ఆయన్ని 'పిచ్చి మాస్టారు' అని ఆటలు పట్టించసాగాడు. ఒకసారి నట్ట నడిబజార్లో మాస్టారుగారి పంచ గోచీకట్టు ఊడలాగాడు. అలా మాస్టారుగారిని అల్లరి పెట్టటం ప్రవీణ్‌కి సరదాగా ఉండేది. తను గొప్ప 'హీరో' అయినట్లు ఫీలయ్యేవాడు.

మరోసారి మాస్టారి కుటుంబమంతా పెళ్లికి వెళ్లింది. మాస్టారు వొక్కరే యింట్లో వున్నారు.

''మాస్టార్ని కొత్త పద్ధతిలో ఏడిపిస్తాను చూడండి'' అని ఫ్రెండ్స్‌తో చెప్పి ప్రవీణ్ ఆయన ఇంటి కెళ్ళాడు.

''మాస్టారూ? నన్ను క్షమించండి మాస్టారూ? నాకు బుద్ధొచ్చింది. చదువు చెప్పరూ?'' అంటూ ఆయన్ని చదువుకునే గదిలోకి తీసుకొచ్చాడు.

మాస్టారి పుస్తకాలు తప్ప మరేమీ లేని గది అది. కనీసం కిటికీలు కూడా లేవు.

ఆ మాస్టారిని గదిలోకి వెళ్ళనిచ్చి తలుపు వేసి తాళం బిగించాడు! బయటికొచ్చి మాస్టారుగారు కూడా పెళ్ళికి వెళ్లేరని ప్రచారం చేశాడు.

ఆ గదిలో ఒంటరిగా తిండీ, నీరూ లేకుండా నాలుగు రోజులున్నారు మాస్టారు. భార్యా పిల్లలు పెళ్ళి నుంచి వచ్చాక బంధవిముక్తి కలిగింది. నీరసంగా ఉన్నా ఆయన నేరుగా ప్రవీణ్ ఇంటికెళ్ళాడు.

''నాయనా ప్రవీణ్! చిన్నవాడివైనా నాకు చాలా పెద్ద మేలు చేశావు. ఎన్నాళ్ళబట్టో నా లైబ్రరీలోని కొన్ని పుస్తకాలు చదవాలనుకుంటున్నాను. తీరిక చిక్కలేదు. నీ పుణ్యాన ఈ నాలుగు రోజుల్లో ఆ పుస్తకాలన్నీ చదివాను. అన్నం కాస్త తినేసరికి కడుపు నిండిపోయి ఇక తినబుద్ధి కాదు. పుస్తకాలు అలా కాదు. చదివేకొద్దీ చదవాలన్న ఆకలి పెరుగుతుంది. ఈ నాలుగు రోజుల్లో ఆకలి చాలా తీరింది నాయనా?''

ప్రవీణ్ బిత్తరపోయాడు. చిక్కిశల్యమైపోయిన ఆ వ్యక్తికి ఎంత ఆత్మవిశ్వాసం! ఎంత మంచితనం!

''మాస్టారూ! నన్ను క్షమించండి మాస్టారూ? దేముడిలాండి మిమ్మల్ని హింసించిన నన్ను శిష్యుడిగా స్వీకరించండి.''

ఆ తరువాత ప్రవీణ్ మాస్టారి ప్రియశిష్యుడయ్యాడు.

★——★——★

ప్రవీణ్ మాస్టారు చెప్పిన దంతా విన్నాడు. అతని మొహం కోపంతో ఎర్రబడింది.

''మాస్టారూ! ఆ హంతకుణ్ణి ఉరికంబం ఎక్కిస్తాను. ఆ దొంగ వెధవను జైల్లో కుక్కిస్తాను'' పరశురాముడు శపథం చేస్తున్నట్లు అన్నాడు ప్రవీణ్. మాస్టారు నవ్వారు.

''నువ్వు నా శిష్యుడి వనుకుని అసలైన న్యాయంకోసం వచ్చాను ప్రవీణ్! నువ్వో పోలీస్ ఆఫీసర్ వని గుర్తించలేకపోయాను.''

''మాస్టారూ!''

''నా భార్యను చంపినందుకు నేను కక్షకట్టి ఆ హంతకుణ్ణి చట్టంచేత చంపిస్తే ఆ హంతకుడి కొడుకు, కూతురు, భార్య, చట్టంమీద, నీ మీద, నా మీద కూడ పగబట్టి హంతకు లయ్యే ప్రమాదం ఉంది ప్రవీణ్! రాక్షసకృత్యాన్ని చేసిన వ్యక్తిని శిక్షించే ముందు అతనిలోని రాక్షసత్వాన్ని శిక్షించాలి. దొంగల్ని జైల్లో కుక్కేముందు వాళ్ళలోని దొంగ ప్రవృత్తిని శిక్షించాలి. రాక్షసత్వాన్ని శిక్షించు. మానవత్వాన్ని పెంపొందించు. అది కోరటానికే నేను వచ్చాను''.

''అలాగే మాస్టారూ! కానీ అసలు వారెవరో ముందు తెలుసుకోవాలి కదా! అందుకోసం మీ ఇంటిని ఓసారి పరిశీలించటానికి అనుమతి నిస్తారా?''

''అందుకు అభ్యంతరం లేదు కానీ వాళ్ళు ప్రొఫెషనల్స్'' పోలీసులకు 'క్లూస్' అందించేటంత

పిచ్చివాళ్ళు కాదు. కాగితం కలం ఇవ్వు. వాళ్ళని నీకు చూపిస్తాను. ఎవిడెన్సులకోసం వెతకటం వృథా ప్రయాస.''

మాస్టారు వారిద్దరి బొమ్మల్ని గీచి చూపించారు. ''నీ పరిభాషలో చెప్పాలంటే ఇతడు హంతకుడు. రెండోవాడు దొంగ. కానీ నా దృష్టిలో ఇద్దరూ మానవత్వం కోల్పోయిన రాక్షసులే!''

''కానీ మాస్టారూ, మీరు కోరిన విధంగా వీళ్ళను శిక్షించాలంటే కొంతకాలం పడుతుంది. ఎందుకంటే వీళ్ళిద్దరూ పేరుమోసిన సెటిల్‌మెంట్ దొంగలు. ఈ మొదటి వాడు ఎల్లమంద. ఈ సెటిల్‌మెంటు దొంగల గాంగ్‌కు నాయకుడు. నేను వేషం మార్చి అయినా మీరు కోరిన గురుదక్షిణ మీ పాదాల దగ్గర సమర్పించుకుంటాను.''

ప్రతాప్ కథను చెప్పటం ఆపాడు.

''ఆపేరేం? కథను పూర్తిచెయ్యండి'' కమల అంది.

''కథను అతను పూర్తి చేయలేడమ్మా. నేను చేస్తాను.''

'నాన్నా!' హఠాత్తుగా అక్కడికొచ్చిన తండ్రిని చూచి బెదిరి పోయింది కమల.

''అవునమ్మా! అతను చెప్పిన కథంతా విన్నాను. ఆ కథకు రెండే ముగింపు లున్నాయి. దొంగల నాయకుడుకు లొంగిపోవటం ఒకటి. రెండోది వేషం మార్చి తమ మధ్య ఉన్న ఆ పోలీస్ ఆఫీసరును చంపెయ్యటం''. అతను ఆయుధం తీశాడు. ఈల వేయగానే అనుచరులు ఆయుధాలతో వచ్చారు.

''నాన్నా?'' భయంతో అని భర్తను గట్టిగా కౌగిలించుకుంది కమల.

''కన్నతండ్రి, కట్టుకున్న భర్త. వీళ్ళిద్దరిలో ఎవరు కావాలంటే నువ్వేం కోరుకుంటా వమ్మా?''

''ఆ బంధుత్వాల కన్నా ధర్మం విలువైనది నాన్నా. రాక్షసత్వాన్ని శిక్షించాలి. ధర్మాన్ని రక్షించాలి. అందుచేత నేను నా భర్తవైపే నిలబడతాను. అవసరమైతే ఆయనతో పాటే మరణిస్తాను''.

''నీకా అవసరం రానియ్యనమ్మా! మేమంతా ఆయుధాలు విసర్జించి అల్లుడికి లొంగిపోతున్నాం. మానవత్వం ముందు తల వంచుతున్నాం''

''ఏమండీ! మా వాళ్ళు మారిపోయారండీ. మాస్టారికి మీ రిక గురుదక్షిణను చెల్లించండి?'' ప్రతాప్‌ను ఆనందంతో చుట్టుకుపోతూ అంది కమల.

ఆంధ్రప్రభ వారపత్రిక — **24.6.87**